# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-05-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌ను ఆధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉందని.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి కలలను అమరావతి సాకారం చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.**
2. **అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.**
3. **ప్రపంచస్థాయి సర్వశ్రేష్ఠ రాజధానిగా అమరావతి ఆవిర్భవిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు.**
4. **కృత్రిమమేధను నైతిక బాధ్యతతో వినియోగిస్తామని ముంబయిలో జరుగుతున్న వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్‌లో 77 దేశాల ప్రతినిధులు తీర్మానం చేశారు.**
5. **తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని అధికారులను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు.**
6. **ఆంధ్రప్రదేశ్‌లో నేటి నుంచి ఈనెల 9వ తేదీ వరకు జరగనున్న గ్రూపు-1 ప్రధాన పరీక్షల నిర్వహణకు ఏపీపీఎస్సీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.**

=========================

ఆంధ్రప్రదేశ్‌ను ఆధునాతన ప్రదేశ్ గా మార్చే శక్తి అమరావతికి ఉందని.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి కలలను అమరావతి సాకారం చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. గుంటూరు జిల్లా వెలగపూడిలో నిన్న ఆయన 58 వేల కోట్ల రూపాయల విలువైన 94 పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. అమరావతి అంటే కేవలం కాంక్రీట్ నిర్మాణాలు కాదని ఆంధ్రప్రదేశ్ ప్రగతికి, వికసిత్ భారత్‌కు బలమైన పునాది అని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభసంకేతమని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధికి కేంద్ర సహకారం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వికసిత్ భారత్‌కు ఆంధ్రప్రదేశ్ గ్రోత్ ఇంజన్‌గా ఎదగాలని ప్రధానమంత్రి ఆకాంక్షిస్తూ...

..వాయిస్..35 సెకన్లు.. .

వికసిత్ భారత్ నిర్మాణం కావాలంటే మహిళలు, కార్మికులు అభివృద్ధి చెందాలని నరేంద్ర మోదీ

పిలుపునిచ్చారు. భారత శక్తి అంటే కేవలం మన ఆయుధాలే కాదని.. మన ఐక్యత కూడా అని స్పష్టంచేశారు. ఈ సంవత్సరం జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించే యోగా దినోత్సవానికి హాజరవుతానని ప్రధానమంత్రి తెలిపారు.

---------------------------

అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. 5 కోట్ల మంది ప్రజలూ 'నా రాజధాని అమరావతి' అని గర్వంగా చెప్పుకొనేలా నిర్మిస్తామని వెల్లడించారు. వెలగపూడిలో నిన్న ఆయన మాట్లాడుతూ.. కొత్త రాజధానిని ప్రారంభించేందుకు మూడేళ్ల తర్వాత మళ్లీ మీరే రావాలంటూ ప్రధానమంత్రిని చంద్రబాబునాయుడు కోరారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో.. అమరావతి నిర్మాణాన్ని పునఃప్రారంభించామని వివరించారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, ఆశలు, ఆకాంక్షలకు ఈ నగరమే ప్రతిరూపమని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

వాయిస్ 35 సెకన్లు....

---------------------------

ప్రపంచస్థాయి సర్వశ్రేష్ఠ రాజధానిగా అమరావతి ఆవిర్భవిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అమరావతి పునఃప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మన యువత ఇక ఉద్యోగాల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలకు వెళ్లనవసరం లేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోనే మన యువతకు ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభను కూడా అమరావతి ఆకర్షిస్తుందని పవన్ కల్యాణ్ ధీమా వ్యక్తం చేశారు. ధర్మయుద్ధంలో అమరావతి రైతులే విజయం సాధించారని, రాజధాని రైతుల పోరాటానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని, వారి త్యాగాలకు జవాబుదారీగా ఉంటామని ఉప ముఖ్యమంత్రి స్పష్టంచేస్తూ..

.....వాయిస్....25 సెకన్లు....

---------------------------

కృత్రిమమేధను నైతిక బాధ్యతతో వినియోగిస్తామని ముంబయిలో జరుగుతున్నవరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్.. 'వేవ్స్ 2025'లో 77 దేశాల ప్రతినిధులు తీర్మానం చేశారు. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్, కేంద్ర సమాచార ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిన్న జరిగిన ఈ చర్చకు అధ్యక్షత వహించారు. ప్రతినిధులు ఆమోదించిన 13 అంశాల తీర్మానం మేరకు.. అసత్య సమాచార వ్యాప్తిని నిరోధించాలని, ప్రసార మాధ్యమాల సమగ్రతను.. వాస్తవ ఆధారిత పాత్రికేయాన్ని ప్రోత్సహించాలని, బాధ్యతాయుతమైన ప్రకటనలకు కట్టుబడాలని సంకల్పం ప్రకటించారు. దీనికి ఆయా దేశాలు మద్దతు తెలిపాయి.

---------------------------

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని అధికారులను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై నిన్న ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా ఇన్‌ఛార్జి మంత్రులు ఆమోదం పొందాలని సూచించారు. ఇళ్ల విస్తీర్ణం 600 చదరపు అడుగులు మించకూడదని.. ప్రతి నియోజకవర్గంలో పట్టణప్రాంతంలో 500 ఇళ్లు నిర్మించాలని స్పష్టంచేశారు. ఈ నెల 5వ

తేదీ నుంచి 20వ తేదీ వరకు 28 మండలాల్లో భూభారతి సదస్సులు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్..ఏపీపీఎస్సీ సారథ్యంలో గ్రూపు-1 ప్రధాన పరీక్షలు నేటి నుంచి ఈ నెల 9వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయి. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలోని 13 కేంద్రాల్లో మొత్తం 4 వేల 496 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు.

---------------------------

తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జి.భీమవరంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ హోంను వర్చువల్ విధానంలో ఢిల్లీ నుంచి ఆమె నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. నేటి వేగవంతమైన జీవన విధానంలో వయో వృద్ధుల ప్రేరణ, మార్గదర్శకత్వం యువతకు చాలా అవసరమని సూచించారు. వృద్ధులు గతానికి వారధి, భవిష్యత్తుకు మార్గదర్శకులని పేర్కొన్నారు. మహిళలు, బాలలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి సూర్యకుమారి మాట్లాడుతూ పదేళ్ల అనంతరం రాష్ట్రానికి 15 నూతన వయో వృద్ధ సంరక్షణ కేంద్రాలు మంజూరయ్యాయని, ఒకదాన్ని జి.భీమవరంలో ప్రారంభించారని తెలిపారు.

---------------------------

వాతావరణ అనిశ్చితితో రాబోయే మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. పిడుగులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈరోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడొచ్చని తెలిపింది. మరోవైపు నిన్న వైఎస్సార్ జిల్లా కమలాపురంలో 42, నంద్యాల జిల్లా గుల్లదుర్తిలో 41.7, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 41.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

---------------------------

అమరావతి కేంద్రంగా వచ్చే ఏడాది జనవరి నుంచి క్వాంటమ్ కంప్యూటింగ్ కార్యకలాపాలు ప్రారంభించనున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దేశంలోనే మొదటి అత్యాధునిక క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్కును అమరావతిలో నిర్మించనున్నామని ఆయన తెలిపారు.

======================